
# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 12 । అక్టోబర్ । 2024

**సోమశిలలో 52.35 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 52.35 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,100 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నార్‌డెల్టాకు 2 వేలు, ఉత్తరకాలువకు 540, దక్షిణకాలువకు 8500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.77,850 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.7,090 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.7,303 |
| నవర (8 గ్రా) | రూ.58,424 |

గరిష్టం/కనిష్టం
33.9 /26.4

**వాతావరణం**

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. శుకవారం గాలిలో తేమ 71 శాతం ఉంది.

## న్యూస్‌రీల్

### ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి రోజున దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**కలెక్టర్ శుభాకాంక్షలు**

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆనంద్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి అంటే విజయానికి ప్రతీక అని, ప్రజలందరికీ ఈ పండగ సుఖ సంతోషాలు ఇవ్వాలని ఆకాంక్షించారు.

### చనిపోయిన మహిళ పేరుతో వ్యక్తిగత రుణం

- ఆమె పేరుతో ప్రైవేట్ బ్యాంక్‌లో ఖాతా ప్రారంభం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారుడు

కందుకూరు: చనిపోయిన ఓ మహిళ పేరుతో బజాజ్ ఫైనాన్స్‌లో వ్యక్తిగత రుణం తీసుకుని నగదు కాజేశారు. ఈ వ్యవహారంపై ఆమె కుమారుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడి సమాచారం మేరకు.. కందుకూరులోని కోటారెడ్డినగర్‌కు చెందిన జడా మరియమ్మ అనే మహిళ ఈ ఏడాది ఏప్రిల్‌లో చనిపోయింది. అయితే ఆమెకు బజాజ్ ఫైనాన్స్ సంస్థ కందుకూరు శాఖలో అకౌంట్ ఉంది. ఈ విషయం తెలుసుకున్న బజాజ్ ఫైనాన్స్‌లో పని చేసే వలేటివారిపాలెం మండలం కళ్లవళ్ల గ్రామానికి చెందిన కే వెంగయ్య మరియమ్మ పేరుపై లోన్ దరఖాస్తు చేశాడు. ఆ విధంగా గత జూన్‌లో మరియమ్మ ఆధార్ కాపీతో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో అకౌంట్‌ను క్రియేట్ చేశారు. మరియమ్మ పేరుతో బజాజ్ ఫైనాన్స్‌లో రూ.3.27 లక్షల లోన్ మంజూరు చేయించుకుని, ఆ నగదును కాజేశారు. ఈ విషయం ప్రస్తుతం ఆమె కుమారుడు జడా దిలీప్‌కు తెలియడంతో వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చనిపోయిన తన తల్లిపై లోన్ మంజూరు చేసిన బజాజ్ ఫైనాన్స్ సిబ్బంది, అకౌంట్ ఓపెన్ చేసిన బ్యాంకు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): అనుమతి లేకుండా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారనే కారణంతో 26 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై దర్గామిట్ట పోలీసులు కేసును శుక్రవారం నమోదు చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావంగా గురువారం కరెంటాఫీస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# పండగ.. ధరాభారం

జిల్లాలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నాయి. గడిచిన నాలుగు నెలల్లో కూరగాయల ధరలు అయితే మూడింతలు పెరిగితే.. నిత్యావసర సరుకుల ధరలు ముప్పై శాతం పెరిగాయి. వీటిని కొనలేక సామాన్య ప్రజలకు పగటి పూటే చుక్కలు కనిపిస్తున్నాయి. ధరల నియంత్రణను పట్టించుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రజా పాలనను గాలికి వదిలేసింది. సంక్షేమ పథకాలను అటకెక్కించింది. ప్రతిపక్ష నేతలపై దాడులు, హత్యలు, కేసులతో బిజీబిజీగా గడుపుతోంది. ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీతో తలమునకలైపోయింది. తాజాగా మద్యం వ్యాపారంపైనే దృష్టి సారించింది.

- బెంబేలెత్తిస్తున్న నిత్యావసర, కూరగాయల ధరలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- ఏది పట్టుకున్నా.. రూ.వంద పైమాటే
- కాగుతున్న వంట నూనె.. కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి



**నెల్లూరులోని జీవీనగర్‌కు చెందిన జీ రవి చిరుద్యోగి. నెలవారీ జీతం రూ.18 వేలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. తన జీతంలో ఇంటి అద్దె రూ.7 వేలు పోను మిగిలేది రూ.12 వేలు మాత్రమే. అందులో నిత్యావసర సరుకులు కోసం రూ.8 వేలు, పాలు, కూరగాయలు, ఇతర ఖర్చులకు రూ.4 వేల పైమాటే అవుతోంది. ఇంకా పిల్లల ఫీజులు, బైక్ పెట్రోల్ ఇతర అవసరాలకు నెలకు మరో రూ.10 వేలు ఖర్చులు అవుతున్నాయి. తాజాగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలతో నాలుగు నెలలుగా మరో రూ.2 వేల నుంచి రూ.3 వేలకు ఖర్చు పెరిగిందని వాపోతున్నాడు. ఇప్పటికే నెలనెలా అప్పులతో నెట్టుకొస్తున్న ఆ కుటుంబంపై మరింత భారం పెరిగింది.**

సాక్షిప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వ పాలనలో సగటు సామాన్యుడి బతుకు భారంగా మారింది. గడిచిన నాలుగు నెలల క్రమంలో నిత్యావసర సరుకుల నుంచి కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. పెరిగిన ధరలు కిందకు దిగిరానంటున్నాయి. ఐదొందలు తీసుకెళ్లితే.. క్యారీ బ్యాగ్ నిండా కూరగాయలు రావడం లేదు. దీనికి తోడు కొందరు వ్యాపారుల కృత్రిమ కొరత సృష్టించి ధరలు మరికాసింత పెంచేస్తున్నారు. ఏ కూరగాయ ధర చూసినా.. కేజీ రూ.100 ఉంటే.. పప్పులు ధరలు రూ.200 పలుకుతున్నాయి. జిల్లా స్థాయిలో ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం ఆ ఊసే పట్టించుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో ధరలు ఐదు నుంచి పది శాతం పెరిగితేనే నానా హంగామా సృష్టించిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు వంద శాతం పెరిగిన పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ధరలు నియంత్రించాల్సిన మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులు చోద్యం చూస్తుండడంతో బహిరంగ మార్కెట్లలో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడంతో మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి.

**కాగుతున్న వంట నూనెలు**

వంట నూనెల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. రిఫైన్డ్ నూనె లీటరు ప్యాకెట్ గతంలో రూ.90 ఉంటే ప్రస్తుతం రూ.140 పలుకుతున్నాయి. చివరకు పామాయిల్ కూడా రూ.130 కంటే తక్కువ లేదు.

**కొంటే 'క్రూర'గాయలు**

కూరగాయలు కొనాలంటే.. ధరలు 'క్రూరంగా' ఉన్నాయి. హోల్‌సేల్ వ్యాపారుల వద్దే ఏ కూరగాయలు అయినా కేజీ రూ.వందకు తక్కువకు లేవు. చివరకు దుంపలు కూడా రూ.80 పలుకుతున్నాయి. ఉల్లిపాయలు రూ.80 పలుకుతుండగా క్యారెట్, బీన్స్ వంటివి కూడా కేజీ రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇక రిటైల్ మార్కెట్లో అయితే మరో పది రూపాయలు ఎక్కువకు విక్రయిస్తున్నారు. ఎండుమిర్చి రూ.200 మార్కు దాటింది.. చింతపండు రూ.140 తక్కువ లేదు. టమాటా రూ.100 పలుకుతోంది. వరదలు, వర్షాభావం పేరుతో ధరలు పెరుగుతున్నాయని కల్లబొల్లి కబుర్లు చెబుతోంది.

**పండగ కళ లేదాయే**

ఐదేళ్ల కాలంలో పండగ వచ్చిందంటే మార్కెట్ కళకళలాడుతుండేది. వివిధ సంక్షేమ పథకాలతో చేతినిండా డబ్బులు ఉండటంతో పాటు పనులు దొరుకుతుండడంతో పేదలు ఇంట్లో పండగ కాంతులు విరజిమ్మాయి. కూటమి ప్రభుత్వం రావడంతో ధరల నియంత్రణపై దృష్టి పెట్టలేదు. మార్కెట్‌లో ఇష్టానుసారంగా ధరలు పెంచేశారు. దీనికి తోడు ఇసుక మార్కెట్‌లో డిమాండ్ క్రియేట్ చేసి అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తుండంతో భవన కార్మికులు పనులు లేక కడుపులు మాడ్చుకుంటున్నారు. అటు కొండెక్కి కూర్చొన్న నిత్యావసర ధరలు, పనులు లేక పేదోడు దసరా, దీపావళి పండగలు ఇంటిళ్ల పాది సంతోషంగా చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

**కందిపప్పునకు దిక్కులేదు**

ప్రతి రేషన్ కార్డుదారుడికి ఉచిత బియ్యంతో పాటు సబ్సిడీ ధరకు కేజీ గోధుమ పిండి, కేజీ కందిపప్పు, అర కేజీ పంచదార ఇవ్వాల్సి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 7,33,520 రేషన్ కార్డులు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం నాలుగు నెలలుగా కార్డుదారులకు సబ్సిడీపై ఎక్కడా కందిపప్పు, చక్కెర ఇవ్వడం లేదు. బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.175 నుంచి రూ.185 వరకు ఉంది. చక్కెర కూడా కిలో రూ.48 నుంచి రూ.55 వరకు ఉంది.

### అర్థమైందా.. రాజా!



- టామాటా నిన్న రూ.వంద.. ఈ రోజు రూ.50
- కూరగాయల మార్కెట్లో వ్యాపారుల సిండికేట్
- కూరగాయలకు కృత్రిమ కొరత

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరు కూరగాయల మార్కెట్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి కూరగాయలకు కృత్రిమ కొరత సృష్టించి, ధరలు పెంచి విక్రయిస్తున్నారని ఈ ఉదంతంతో అర్థమవుతోంది. కిలో టామాటాలు నిన్నటి వరకు కేజీ రూ.100లకు విక్రయించిన వ్యాపారులు ఒక్క రోజులోనే రూ.50లకు తగ్గించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో రైతుబజార్లలో సబ్సిడీపై కిలో రూ.50 చొప్పున విక్రయాలు ప్రారంభించడంతో వెంటనే హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో విక్రయదారులు రూ.100 నుంచి ఏకంగా కిలో రూ.50లకు విక్రయాలు చేయడం మొదలు పెట్టారు. దీంతో అందరిలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. రెండు రోజుల్లో ఇంత తగ్గడం ఎలా సాధ్యం. ప్రధానంగా మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఈ విధంగా చెప్పిందే రేటుగా విక్రయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇతర కూరగాయలు కూడా..**

మార్కెట్‌లో ఇతర కూరగాయలు వంకాయలు, ఉల్లగడ్డలు, క్యారెట్, కాకర కాయలు, మునక్కాయలు, పందిరి చిక్కుళ్లు కిలో రూ.80 వరకు ఉండడం గమనార్హం. ప్రధానంగా అధికార పార్టీ నేతల అండతో మార్కెట్లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సబ్సిడీకే సరఫరా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కూడా ధరలు కాసింత పెరగ్గానే జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లలో సబ్సిడీ ధరలకు సరఫరా చేసేది. ప్రధానంగా టామాటాలు, ఉల్లిపాయలు, పప్పు దినుసులు.. ఇలా ఏది ధరలు పెరిగితే.. వాటిని తక్కువ ధరకు అందించే ప్రయత్నం చేయడం ద్వారా మార్కెట్లో వ్యాపారులు సైతం దిగొచ్చి తక్కువ ధరలకే విక్రయించే వారు. ఇలా ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్ కార్డుదారులకు కిలో కందిపప్పు రూ.67, అరకిలో చక్కెర రూ.17లకు సరఫరా చేసింది.

### పిల్లలకు కడుపు నిండా పెట్టిలేని పరిస్థితి



నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో ఇంట్లో కనీసం అవసరాలకు తగినట్లు కూడా సరుకులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. పిల్లలకు కడుపు నిండా తిండి పెట్టలేకపోతున్నాము. కందిపప్పు కిలో రూ.185, వెల్లుల్లి రూ.400, ఎండుమిర్చి రూ.400, వంట నూనెలు రూ.150. టమోటాలైతే ఏకంగా రూ.100, ఇతర కూరగాయల ధరలు కిలో రూ.80లకు తక్కువ లేవు.

– దక్కిలి శ్రావణి, పూడిపర్తి, వెంకటాచలం మండలం

### రాయితీపై అందించాలి



మార్కెట్‌లో ధరల అదుపునకు ప్రభుత్వం కృషి చేసి ప్రజలకు రాయితీపై అందించాలి. మార్కెట్‌లో కొనుగోలు చేసి ఎక్కువ ధరలతో వీధుల్లో అమ్ముతున్నారు. సామాన్యులు బతకడం కష్టమే. పండగ సందర్భంగా అటు నిత్యావసరాలు, ఇటు కూరగాయల ధరలు ఆకాశన్నంటుతుండడంతో ప్రజలు నానా కష్టాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణను పట్టించుకోవడం లేదు.

– సుజాత, సీతారామపురం

### పండగ ఎలా చేసుకునేది



పప్పు దినుసులు, వంట నూనె, కూరగాయలు ధరలు అమాంతం పెరిగాయి. ఇదే నెలలో దసరా, దీపావళి పండగలు ఉండడంతో అధిక ధరలు సామాన్యుడిపై పెనుభారంలా మారింది. మరో వైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాల్లో వచ్చే పథకాలు కొంత ఉపయోగపడేది. అయితే అవి కూడా రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– లక్ష్మి, జనార్దన్‌రెడ్డికాలనీ, నెల్లూరు

### నిత్యావసరాలు కొనలేని దుస్థితి



నాలుగు నెలల్లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఆయిల్ ధరలు ఆకాశాన్ని అంటాయి. గతంలో నెలకు నిత్యావసరాలకు రూ.6 వేలు అయితే.. ఇప్పుడు రూ.8 వేలు అవుతున్నాయి. కూరగాయాల ధరలు మూడింతలు పెరిగాయి. పండగ పూట కూడా పప్పున్నం కరువైనట్లు పప్పుల ధరలు కేజీ రూ.200 పలుకుతున్నాయి. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– సరస్వతి, ఎన్టీఆర్‌నగర్, నెల్లూరు

### ధరల నియంత్రణ లేకుండా పోయింది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు, కూరగాయాల ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు ధరలు నిర్ణయించి విక్రయాలు చేస్తున్నారు. కూరగాయలు ఏవి కొనాలన్నా.. కిలో రూ.80కి పైగా ఉంటున్నాయి. పప్పు దినుసులు ధరలు అమాంతం పెరిగిపోయాయి. ధరలు తగ్గకుంటే కుటుంబ పోషణ కష్టమే.

– చాగంటి రాజేశ్వరి, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

### ఇంతగా ఎప్పుడూ లేదు



మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనాలంటేనే భయమేస్తోంది. అన్ని రకాల కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. కనీసం కొత్తిమీర కూడా కొనే పరిస్థితి లేదు. చివరకు ఉల్లి, వెల్లుల్లి ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. గత ప్రభుత్వంలో ధరలు పెరిగితే.. పది పదిహేనే రోజుల్లోనే తగ్గేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇష్టానుసారంగా పెరిగాయి. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

– విజయలక్ష్మి, సీతారామపురం

## ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- జేసీ కార్తీక్

నెల్లూరు(సెంట్రల్): నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జేసీ కొల్లాబత్తిన కార్తీక్ తెలిపారు. నెల్లూరులోని నవాబుపేట రైతుబజార్‌లో వంట నూనె ఇతర సరుకుల విక్రయాల కౌంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్తీక్ మాట్లాడుతూ మంచి రకం బియ్యం, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో పాటు పలు వస్తువులు తక్కువ ధరకు విక్రయాలు చేసేందుకు జిల్లాలో 18 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో రేషన్ కార్డుపై 3 లీటర్ల పామాయిల్, ఒక లీటర్ సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్, కిలో టమోటా రూ.42, ఉల్లిపాయలు కిలో రూ.32లకు విక్రయాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డీఎస్‌ఓ వెంకటరమణ, మార్కెటింగ్ శాఖ ఏడీ అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.



సరుకులను కొనుగోలుదారులకు అందజేస్తున్న జేసీ కార్తీక్

## రాత్రి వరకు దరఖాస్తుల జాతర

- జిల్లాలో 182 మద్యం దుకాణాలకు 3,833 దరఖాస్తులు
- సాయంత్రం 7 గంటలకే వరకే గడువు
- అయినా ఆఫ్‌లైన్‌లో ప్రక్రియ కొనసాగింపు
- చివరి రోజు రాత్రి 10 గంటల సమయానికి 1,026 దరఖాస్తులు దాఖలు
- నగటు ఒక్కొక్క షాపునకు 21 దరఖాస్తులు

నెల్లూరు (క్రైమ్): మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల జాతర శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. దరఖాస్తుల ప్రక్రియ గడువుకు శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకే అయినప్పటికీ రాత్రి 11 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో కొనసాగింది. జిల్లాలో 182 మద్యం దుకాణాలకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో 3,833 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ లెక్క ప్రకారం దరఖాస్తుల రూపేణా ప్రభుత్వ ఖజానాకు రూ.76.66 కోట్లు సమకూరనుంది. చివరి రోజు ఆఫ్‌లైన్‌లో పెద్ద ఎత్తున దరఖాస్తులు దాఖలవుతాయని అధికారులు భావించి అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే అధిక శాతం మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి 2,807 దరఖాస్తులు దాఖలు కాగా చివరి రోజు శుక్రవారం వ్యాపారులు 1,026 దరఖాస్తులు వేశారు. నెల్లూరు నగరంలోని 30 షాపులకు 735 దరఖాస్తులు వచ్చాయి.

**అయినా సిండికేటే**

మద్యం దుకాణాలను కేవలం టీడీపీ నేతలే దక్కించుకునేందుకు ఆది నుంచి సిండికేట్‌గా మారిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పెద్దలు, పార్టీ ఎమ్మెల్యే నిర్దేశించిన వారే దరఖాస్తులు చేయాలని, వేరెవరైనా దరఖాస్తు చేసి సహించబోమని టీడీపీ నేతలు వార్నింగ్ ఇవ్వడంతో పాటు ఒక వేళ దుకాణం వచ్చిన తమకే కేటాయించాలని, లేదంటే వాటాలు ఇవ్వాలనే డిమాండ్లతో ఔత్సాహిక వ్యాపార వేత్తలు ముందుకు రాలేదు. అనుకున్న స్థాయిలో దరఖాస్తులు పడకపోవడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఊరూరా తిరిగి పాత మద్యం వ్యాపారులతో మాట్లాడినా ఫలితం లేకపోయింది. పారదర్శకతకు పాతరేసి, సిండికేట్ల వ్యవహారంపై పెద్దఎత్తున దుమారం రేగడంతో దరఖాస్తుల గడువును మరో రెండు రోజులు పొడిగించిన పరిస్థితి ఏర్పడింది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వచ్చిన దరఖాస్తులు చూస్తే ఒక్కొక్క దుకాణానికి సగటున 15 దరఖాస్తులు కూడా పడలేదు. తాజాగా మరో రెండు గడువు పెంచి అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరించడంతో సగటున దరఖాస్తుల శాతం 21కు పెరిగింది. అయితే అధికంగా పడిన దరఖాస్తులన్నీ బోగస్‌వే అనే ప్రచారం జరుగుతోంది. ఈనెల 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 14వ తేదీ ఉదయం కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ విధానంలో వ్యాపారులకు లైసెన్సులు అందజేస్తారు. 16వ తేదీ నుంచి ప్రైవేట్ వైన్ షాపులు ప్రారంభం కానున్నాయి.

## యథేచ్ఛగా మట్టి తరలింపు

- అధికార పార్టీ నాయకుల నిర్వాకం

పొదలకూరు: అధికారం ఉందని టీడీపీ నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. యథేచ్ఛగా చెరువుల్లోని మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని మరుపూరు చెరువు నుంచి లేఅవుట్లకు పట్టపగలే గ్రామానికి చెందిన నాయకడొకరు మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల దీనిని అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ ఇష్టానుసారం చెరువును లోడేస్తూ మట్టిని రవాణా చేస్తున్నట్లు రైతులు వెల్లడించారు. జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. చర్యలు తీసుకోకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొంటున్నారు.



మట్టిని లోడ్ చేస్తున్న దృశ్యం

### అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై
## జానీమాస్టర్ బంధువు ఫిర్యాదు

నెల్లూరు (క్రైమ్): సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ వ్యవహారంలో మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. జానీ మాస్టర్ కేసులో బాధితురాలైన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ తనను లైంగికంగా వేధిస్తోందని ఓ యువకుడు శుక్రవారం నెల్లూరు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సేకరించిన సమాచారం మేరకు.. రంగనాయకులపేటకు చెందిన సమీర్ ప్రస్తుతం బిటెక్ చదువుతున్నాడు. అతను కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ మేనమామ కుమారుడు. సమీర్ ఎక్కువగా హైదరాబాద్‌లో జానీమాస్టర్ వద్ద ఉండేవాడు. ఆయనతో పాటు షూటింగ్‌లకు వెళ్లేవాడు. ఈ క్రమంలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న యువతితో అతనికి పరిచయం అయింది. ఆమె 2020 నుంచి తనను తరచూ లైంగిక వేధింపులకు గురిచేసిందని సమీర్ ఆరోపించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సదరు యువతి జానీమాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు పెట్టడం, అతన్ని పోలీసులు అరెస్ట్ చేయడంతో జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండడం తెలిసిందే. తాజాగా ఆ యువతిపై జానీమాస్టర్ మేనమామ కొడుకు ఫిర్యాదు చేయడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వ్యవహారం మొత్తం తెలంగాణ, చెన్నై రాష్ట్రాల్లో జరగడంతో పోలీసులు న్యాయ నిపుణుల సలహాలను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



## నెల్లూరులో రావణ దహనం

శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నెల్లూరులోని శ్రీరాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద శుక్రవారం రాత్రి రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 60 అడుగుల ఎత్తున రావణాసురుని రూపాన్ని తాత్కాలికంగా ప్రతిష్టించి పెద్ద ఎత్తున బాణసంచా వినియోగించి దహనం చేశారు.

– నెల్లూరు(బృందావనం)



తిలకిస్తున్న జనం

## వీధి కుక్కల దాడిలో మహిళకు తీవ్రగాయాలు



సోమశిల: వీధి కుక్కల దాడిలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన అనంత సాగరం మండలం లింగంగుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల లక్ష్మమ్మ ఇంటి బయట ఉండగా వీధి కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేశాయి. కాలు పట్టుకుని పీకడంతో తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి కుక్కలను తరిమి ఆమెను కాపాడారు. కాగా గ్రామంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు తెలిపారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తుండడంతో ఒంటరిగా వీధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## అల్లూరులోని ఆశ్రమానికి చిన్నారులు

సంగం: బాతుల యజమాని వేధింపుల తాళలేక పారిపోయిన గిరిజన చిన్నారులను అల్లూరులోని చైల్డ్ ఆశ్రమానికి తరలించారు. అధికారుల కథనం మేరకు.. పాలకీర్తి సుశీలమ్మ, బొడెయ్య దంపతులు బాతులు మేపుతుంటారు. దగదర్తి మండలం కాంట్రాయిపాడుకు చెందిన ఏలూరు చెంచమ్మ, చెంచయ్య దంపతులు తమ పిల్లలైన దుర్గ, భవానీలను సుశీలమ్మ వద్ద ఐదు సంవత్సరాల క్రితం బాతులు మేపే పనికి వదిలారు. అయితే చిన్నారులు యజమాని వేధింపులు భరించలేకపోయారు. దీంతో అక్కడి నుంచి తప్పించుకున్నారు. సంగం జంగాలకండ్రిక సమీపంలో కావలికాలువ కట్ట వద్ద బుధవారం రాత్రి పిల్లలు తిరుగుతుండగా స్థానికులు గుర్తించి సర్పంచ్ సునీల్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన వారిని గురువారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు డీసీపీఓ బి.సురేష్, సీడీపీఓ సునీలత, ఏఎల్‌ఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు సంగం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పిల్లలతో మాట్లాడారు. నెల్లూరు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల ప్రకారం అల్లూరులో ఉన్న ఆశ్రమంలో వారిని చేర్చారు. ఈ వ్యవహారంపై చైల్డ్ లేబర్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.



పోలీస్‌స్టేషన్ వద్ద చిన్నారులతో అధికారులు

## విద్యుత్ శాఖ గెస్ట్‌హౌస్ ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ కార్యాలయం విద్యుత్ భవన్ ఆవరణలో గెస్ట్ హౌస్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ శాఖ వారు రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురుగా రూ.3 కోట్లతో గెస్ట్‌హౌస్ నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ విజయన్, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్ చౌదరి, పలువురు డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## త్వరితగతిన నీటిని సరఫరా చేయాలి

• మంత్రి నారాయణ

పొదలకూరు: నెల్లూరు నగరానికి త్వరితగతిన మంచినీటిని సరఫరా చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. నెల్లూరుకు మంచినీటిని సరఫరా చేసేందుకు మెగా వాటర్ ప్రాజెక్ట్‌ను మండలంలోని మహ్మదాపురం తిప్పపై నిర్మించారు. ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండురోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మంత్రి ఆ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, సంబంధిత శాఖ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని ధ్వజమెత్తారు. వెంటనే పరిస్థితిని చక్కదిద్దాల్సిందిగా ఆదేశించారు. నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టంను రూ.550 కోట్లతో గతంలో శ్రీకారం చుట్టామన్నారు. మంచినీటి పథకానికి మరో రూ.550 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ



# సాక్షి క్లాసిఫైడ్స్



### గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

## పది కేజీల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ సుధాకర్‌రెడ్డి

కోవూరు: జల్సాలకు అలవాటు పడి గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. కోవూరు సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హిమన్షు శేఖర్ పడుగుపాడు రైల్వే స్టేషన్ వద్ద మోటార్‌బైక్‌తో అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు తనిఖీ చేయగా అతని వద్ద పది కేజీల గంజాయి దొరికింది. నెల్లూరుకు తరలించి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని కోవూరు తహసీల్దార్ నిర్మలానంద బాబా సమక్షంలో అరెస్ట్ చేశారు.


## మాజీ హోంగార్డు అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సీఐ ఐడీ పార్టీ కానిస్టేబుల్ పేరిట డాక్టర్‌ను బెదిరించిన ఘటనలో మాజీ హోంగార్డును నెల్లూరు బాలాజీ నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అంబాపురానికి చెందిన రియాజ్ పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేశాడు. పలువురిని బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడడంతో అతడిపై చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. రియాజ్ ఈనెల 8వ తేదీ రాత్రి అపోలో హాస్పిటల్ జంక్షన్ వద్ద బైక్‌పై ఇంటికి వెళ్తున్న వైద్యుడు విశ్వనాథ్‌ను అడ్డగించి నగదు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ పవన్ కాలనీ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన ప్రదీప్ పవన్ కాలనీ వద్ద జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ సమయంలో నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న బైక్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రదీప్ గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.60
నన్నవి : రూ.30
పండ్లు : రూ.20

## నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 136 |
| లేయర్ (లైవ్) | : 118 |
| బ్రాయిలర్ చికెన్ | : 244 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 268 |
| లేయర్ చికెన్ | : 200 |